క్లుప్తంగా

సుబ్రమణ్యస్వామి విగ్రహ ఏర్పాటుకు విరాళాలు



విరాళమిచ్చిన దాతలు

పాకాల: ఊట్లవారిపల్లి సమీపంలోని ఆనంద గిరి కొండపై 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహ ఏర్పాటుకు దాతలు విరాళాలు అందజేస్తున్నారు. మోటకంపల్లికి చెందిన బొల్లినేని శ్రీనివాసులునాయుడు, రాధ రూ.51,116, నల్గొండకు చెందిన డాక్టర్ పుల్లారు జయకుమార్, అనిత రూ.51,116లను శనివారం ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డికి అందజేశారు. వారికి స్వామివారి దర్శనం కల్పించి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాల

తిరుమల: శ్రీవారిని శనివారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాల, తెలంగాణ ఎమ్మెల్సీలు బసవరాజు సారయ్య, రఘోత్తంరెడ్డి, ఏపీ ఎమ్మెల్సీలు కల్పలతా రెడ్డి, దువ్వాడ శ్రీనివాసులు, మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

అజరామరుడు ఘంటశాల



ఘంటశాలకు నివాళులర్పిస్తున్న తిరుపతి ఫిలిం సొసైటీ సభ్యులు

తిరుపతి కల్చరల్: గాన గంధర్వుడు ఘంటశాల వెంకటేశ్వరరావు అజరామరుడని తిరుపతి ఫిలిం సొసైటీ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఘంటశాల వర్ధంతి సందర్భంగా తిరుపతి ఫిలిం సొసైటీ సభ్యులు స్థానిక ఘంటశాల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత శ్రీవారి గీతాలను ఆలపించిన ఘనత ఘంటశాలకే దక్కిందన్నారు. ఈ సందర్భంగా గాయకుడు సోము ఉమాపతిని సన్మానించారు. సొసైటీ ఉపాధ్యక్షులు బుజ్జిబాబు నాయుడు, గుల్జార్, కోశాధికారి యు.ప్రసాద్‌రావు, సభ్యులు మేరీ జాయ్, భాస్కర్, బాషా పాల్గొన్నారు. అదేవిధంగా రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో వీవీ మహల్ సర్కిల్‌లోని ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి ఘననివాళులర్పించారు. గాయకుడు సోము ఉమాపతిని సత్కరించారు. రంగస్థలి చైర్మన్ గూండాల గోపీనాథ్ రెడ్డి, కళాకారులు మర్దం గజేంద్ర, కొట్టే సుబ్రమణ్యంరెడ్డి, తిరుపాలాచారి పాల్గొన్నారు.



గాయకుడు సోము ఉమాపతిని సత్కరిస్తున్న రంగస్థలి ప్రతినిధులు

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం

- కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం
- పెద్ద శేష వాహనంపై విహరించిన శ్రీహరి



విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు



ధ్వజారోహణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ధ్వజారోహణంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. అనంతరం 6.30 నుంచి 8.15 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి తిరుచ్చిపై, గరుడాళ్వార్, చక్రతాళ్వార్ తిరుమాడవీధుల్లో విహరిస్తూ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఉదయం 8.40 నుంచి 9 గంటల మధ్య మీనలగ్నంలో అర్చకులు విష్వక్సేన ఆరాధన, వాస్తు హోమం, గరుడ లింగ హోమం, గరుడ ప్రతిష్ట, రక్షా బంధనం చేపట్టారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారి సమక్షంలో గరుత్మంతుడిని నూతన వస్త్రంపై లిఖించి, పూజలు చేసి, ధ్వజ స్థంభంపై ఎగురవేశారు. ధ్వజారోహణ ఘట్టంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి.

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

కల్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లుచేపట్టినట్టు జేఈవో వీరబ్రహ్మం తెలిపారు. ఆయన శనివారం ధ్వజారోహణంలో పాల్గొన్నారు.



వాహన సేవలో జేఈఓ వీరబ్రహ్మం, అధికారులు

అనంతరం మీడియాతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 15న గరుడ సేవ, మార్చి 16న స్వర్ణ రథోత్సవం, 18న రథోత్సవం, 19న చక్రస్నానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, రాత్రి 7 నుంచి 8 గంటల వరకు వాహన సేవలు జరుగుతాయన్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో అన్ని ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. భక్తులకు అన్న ప్రసాదాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధార్మిక ప్రవచనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గురుమూర్తి, సూపరింటెండెంట్లు చెంగల్రాయులు, వెంకటస్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి,, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

పెద్ద శేష వాహనంపై శ్రీనివాసుడి వైభవం

బ్రహ్మోత్సవాల్లో శ్రీవారు స్వయంగా ఊరేగింపులో పాల్గొనే మొదటి ఉత్సవం పెద్ద శేష వాహనం. ఈ క్రమంలో శనివారం రాత్రి స్వామి వారు శ్రీదేవి, భూదేవి సమేతంగా పెద్ద శేష వాహనంపై కొలువుదీరి నాలుగు మాడ వీధుల్లో విహరించారు. భక్తుల గోవింద నామస్మరణలతో నాలుగు మాడవీధులు మారుమోగాయి.

బ్రహ్మోత్సవాల్లో నేడు

శ్రీనివాస మంగాపురంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజు ఆదివారం ఉదయం స్వామి వారు చిన్న శేష వాహనంపై, సాయంత్రం హంస వాహనంపై ఊరేగనున్నారు.

ఘనంగా భవుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాల ప్రారంభం సందర్భంగా పురవీధుల్లో ఊరేగుతున్న పంచమూర్తులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పంచమూర్తులైన సోమస్కందమూర్తి, కామాక్షి అమ్మ వారు, వినాయక స్వామి, చండికేశ్వరస్వామి, శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్యంస్వామి ఉత్సవమూర్తుల సమక్షంలో ఉదయం 8.54 గంటలకు మీన లగ్నంలో నంది చిత్రంతో కూడిన వస్త్రాన్ని ధ్వజపటానికి చుట్టి ధ్వజ స్తంభంపైకి అధిరోహింపజేశారు. పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

ధ్వజారోహణం అనంతరం కపిలేశ్వరస్వామి, కామాక్షి అమ్మవారి పల్లకీ ఉత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అడుగడుగునా భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించారు.

హంస వాహనంపై కపిలేశ్వరుడి వైభవం



ధ్వజారోహణం చేపడుతున్న అర్చకులు

కపిలేశ్వరస్వామి రాత్రి హంస వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మణిస్వామి, కంకణభట్టర్ ఉదయస్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ పార్థసారథి, సూపరింటెండెంట్ భూపతి, ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోయేలా ఆలయ నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : వెయ్యేళ్ల చరిత్ర కలిగిన తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పునర్నిర్మాణం చరిత్రలో నిలిచిపోయేలా ఉంటుందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన శనివారం నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శ్రీ వెంకటేశ్వర స్వామి చెల్లెలు తిరుపతి గంగమ్మ ప్రతిష్టను చాటి చెప్పేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్టు తెలిపారు. పనులు శరవేగంగా జరిగేలా చూడాలని ఆలయ చైర్మన్, ఈవోలను ఆదేశించారు. కార్యక్రమంలో గంగమ్మ ఆలయ చైర్మన్ కట్టా గోపీ యాదవ్, నాయకులు దొడ్డారెడ్డి శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

- గ్రాడ్యుయేట్లకు 25, టీచర్లకు 4 పోలింగ్ కేంద్రాలు
- కమిషనర్ అనుపమ అంజలి



ఎన్నికల ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా: తిరుపతి నియోజకవర్గంలో నిర్వహించనున్న ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్, ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణాధికారి అనుపమ అంజలి తెలిపారు. ఆమె శనివారం పోలింగ్ కేంద్రాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ విడుదలైందని, కలెక్టర్ ఆధ్వర్యంలో ఎన్నికల కోడ్‌ను అమలు చేస్తున్నట్టు తెలిపారు. తిరుపతి నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ ఓటర్లకు 25, టీచర్లకు 4 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. బ్యాలెట్ బాక్సులు కొన్నింటికి మరమ్మతులు చేయిస్తున్నామన్నారు. అలాగే 200 డబుల్ ఎంట్రీ ఓట్లను గుర్తించామన్నారు. ఈ జాబితాను బీఎల్‌వోలకు ఇచ్చి ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి తొలగిస్తామన్నారు. కమిషనర్ వెంట ఉప కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, తహసీల్దార్ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ జీవన్ తదితరులు ఉన్నారు.

యువకుడికి గాయాలు

చంద్రగిరి: పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిలోని ఐతేపల్లి సమీపంలో శనివారం ద్విచక్ర వాహనం ట్రాక్టర్‌ను ఢీకొనడంతో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు రూరల్ కొంగారెడ్డిపల్లికి చెందిన హరికృష్ణ వ్యక్తిగత పనులు ముగించుకుని శనివారం ద్విచక్ర వాహనంపై చిత్తూరుకు పయనమయ్యాడు. ఐతేపల్లి సమీపంలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. హరికృష్ణకు కుడికాలికి తీవ్ర గాయమైంది. అతన్ని స్థానికులు 108లో తిరుపతి రుయాకు తరలించారు.

మానవతా దృక్పథంతో ఆదుకోండి

తిరుపతి కల్చరల్: టర్కీ, సిరియా ప్రాంతాల్లో భూకంపంతో వేల సంఖ్యలో మరణాలు సంభవించాయని, అక్కడి బాధితులను మానవతా దృక్పథంతో ఆదుకోవడానికి ముందుకు రావాలని రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ రమేష్‌నాథ్ లింగోట్ల పిలుపునిచ్చారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. భూకంపంతో భవనాలు కుప్ప కూలాయని, అనేక మంది నిరాశ్రయులు అయ్యా రని తెలిపారు. వారిని మానవతాదృక్పథంతో ఆదుకోవాలని కోరారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం కపిలతీర్థం రోడ్డులో ఉన్న ఆదాయపు పన్ను శాఖ కార్యాలయం నుంచి గాంధీ రోడ్డు, నాలుగు కాళ్ల మండపం వరకు ర్యాలీగా విరాళాలు సేకరించనున్నామన్నారు. దాతలు స్పందించాలని కోరారు. లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్, సహాయ కమిటీ కన్వీనర్ రాజకుమార్, గోవిందధామం కోశాధికారి హేమచంద్ర, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఎంఎం రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ దేవరాజులు, జేసీఐ అధ్యక్షుడు గుణశేఖర్, సోమయ్య, మణికంఠన్, రమణ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

- టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పండి
- మాస్టర్ ప్లాన్ రోడ్లుతో ట్రాఫిక్ సమస్యకు చెక్



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తిరుపతి కల్చరల్: తిరుపతిలో ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకుడు దొడ్డారెడ్డి మునిశేఖర్‌రెడ్డి మండిపడ్డారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి రాజకీయ చరిత్రలోనే ఇంతవరకు ఎవరి వల్లా సాధ్యం కాని కొర్లగుంట రోడ్డు విస్తరణ పనులు, నగర శివారు ప్రాంతాల్లో 14 మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణం చేపట్టిన ఘనత ఎమ్మెల్యే భూమన, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డికి దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. తిరుపతి గంగమ్మ ఆలయం వద్ద సీసీరోడ్ల నిర్మాణంలో ఎక్కువ శాతం వైఎస్సార్‌సీపీ నాయకుల స్థలాలే పోతున్నాయని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, భరణి, రామకృష్ణారెడ్డి, వీరమాకుల సురేష్, గురవయ్య, పాండ్రవేటి అభిషేక్‌రెడ్డి, శక్తి స్వచ్ఛందంగా స్థలాలు ఇచ్చారని తెలిపారు. దీనిపై విమర్శలు చేయడం తగదన్నారు. ఉద్దేశపూర్వకంగా రాజకీయ కక్షలను లేవనెత్తాలని, ప్రజల దృష్టి ని మరల్చడానికి టీడీపీ నాయకులు ప్రయత్నిస్తున్నా రని ఆరోపించారు. అభివృద్ధి కార్యక్రమాలు పూర్తవ్వాలంటే డబ్బులు ఇవ్వాలని చేస్తున్న ప్రచారం అవాస్తవమని, ఆధారాలతో సహా నిరూపించాలని డిమాండ్ చేశారు. రాజేంద్ర నాయుడు అనే వ్యక్తి నగరపాలక సంస్థకు రూ.40 లక్షలు బకాయి ఉన్నారని, బకాయి అడిగితే కక్ష సాధింపులుగా చిత్రీకరించడం మంచి పద్ధతి కాదన్నారు. ఇలాంటి విమర్శలను మరొకసారి చేస్తే చట్ట ప్రకారం ముందుకు వెళ్తామని హెచ్చరించారు. భరణి యాదవ్, తులసి యాదవ్, దొడ్డారెడ్డి మురళి రెడ్డి, గోపాల్‌రెడ్డి, బుల్లి, ఉదయ్ వంశీ, దొడ్డారెడ్డి మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

బండిబాటలో అర్ధరాత్రి గోడ నిర్మాణం



అర్ధరాత్రి కట్టిన గోడను తొలగిస్తున్న గ్రామస్తులు

చంద్రగిరి: మండలంలోని ఐతేపల్లి పంచాయతీ మామండూరు దళితవాడ వాసులు వినియోగించుకుంటున్న బండిబాటలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా గోడ నిర్మించారు. గ్రామస్తులు శనివారం తెల్లవారుజామున గోడను తొలగించారు. దీంతో ఆగ్రహం చెందిన గుర్తు తెలియని వ్యక్తులు గ్రామస్తులపై దాడికి దిగారు. గ్రామస్తుల కథనం మేరకు.. మామండూరు హరిజనవాడ వాసులు 50 ఏళ్ల నుంచి బండి బాట నుంచే ఐతేపల్లి జాతీయ రహదారిలోకి వెళుతున్నారు. దారికి ఆనుకున్న ఉన్న దామోదర నాయుడు కొంతమంది కిరాయి రౌడీలను పంపించి రాత్రికి రాత్రి గోడను నిర్మింపజేశాడు. తెల్లవారుజామున పనులను గమనించి కొంతమంది స్థానికులు అక్కడికి చేరుకున్నారు. వారిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడికి దిగారు. దీంతో గ్రామస్తులు ఏకమై అక్రమంగా నిర్మించిన గోడను తొలగించారు. 2013–17 మధ్యలో బండిబాటలో ఉపాధి హామీ కింద అప్పటి సర్పంచ్ నాగరాజు మరమ్మతులు కూడా చేశారని గ్రామస్తులు చెబుతున్నారు. అది దారి కాదని, తమ పట్టా భూమి అని దామోదరనాయుడు బంధువులు పేర్కొంటున్నారు. దళితులపై దాడి జరిగిన విషయం తెలుసుకున్న అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పుణ్యమూర్తి అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. అర్ధరాత్రి గోడ నిర్మించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను సీఐ, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామని, న్యాయం జరగకపోతే ప్రభుత్వ జీఓ ప్రకారం సమస్యను పరిష్కరించుకుందామని గ్రామస్తులకు ధైర్యం చెప్పారు. దీనిపై గ్రామస్తులు చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు విచారణ చేస్తున్నారు.

తిరుమల దర్శనానికి హెలికాప్టర్ సేవలు !

- చెన్నై ఏరోడాన్ సంస్థ సోషల్ మీడియా ప్రచారం

తిరుమల: చెన్నై నుంచి తిరుపతి, అక్కడి నుంచి తిరుమలకు రూ.98,999లతో శ్రీవారి దర్శనం కల్పిస్తామని చెన్నైకి చెందిన ఏరోడాన్ సంస్థ బ్రోచర్ విడుదల చేసింది. ఇందులోనే కారు, వసతి, వీవీ ఐపీ దర్శన్ టికెట్, ఆహారం అందిస్తామని పేర్కొంది. సదరు బ్రోచర్‌పై ఉన్న ఫోన్ నంబర్‌ను టీటీడీ విజిలెన్స్ అధికారులు సంప్రదించగా తాము హెలికాప్టర్ సేవలు మాత్రమే అందిస్తామని, అవసరమైన వారికి దర్శనం కల్పించడంపై పరిశీలిస్తున్నామని చెప్పినట్టు తెలిసింది.



ఏరోడాన్ సంస్థ బ్రోచర్

లోక్ అదాలత్‌లో 3,220 కేసుల పరిష్కారం



తిరుపతి జిల్లా కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి వీర్రాజు, పాల్గొన్న కక్షిదారులు

తిరుపతి లీగల్: తిరుపతి కోర్టు ఆవరణలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 3,220 కేసులను పరిష్కరించినట్టు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా అధికార సంస్థ చైర్మన్ వై.వీర్రాజు తెలిపారు. పరిష్కారమైన కేసుల్లో క్రిమినల్ కేసులు- 156, సివిల్ కేసులు -31, మోటార్‌వాహన ప్రమాద కేసులు- 9, వివాహ సంబంధ కేసులు -7, వ్యాజ్యం వేయని కేసులు- 150 ఉన్నాయన్నారు. అలాగే మొదటి ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టులో 2,138 కేసులు, రెండో ప్రత్యేక మెజిస్ట్రేట్ కోర్టులో 306 కేసులు, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, తిరుమల క్యాంప్ కోర్టు, ఐదో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో 220 కేసులను పరిష్కరించి చిన్న నేరాలకు పాల్పడిన వారికి జరిమానా విధించినట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. కేసుల పరిష్కారం కోసం ఐదు బెంచ్‌లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభమైన లోక్ అదాలత్ రాత్రి 7 గంటల వరకు కొనసాగింది.

పాకాలలో 209 కేసులు..

పాకాల: స్థానిక కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 209 కేసులను పరిష్కరించినట్టు ఇన్‌చార్జ్ జడ్జి పి.శాంతి తెలిపారు. కక్షిదారులకు రూ.6.54 లబ్ధి చేకూర్చినట్టు పేర్కొన్నారు. బాధితులు కోర్టుల చుట్టూ తిరిగి సమయాన్ని వృథా చేసుకోకుండా లోక్ అదాలత్‌లో కేసులను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. న్యాయవాదులు గురుస్వామినాయుడు, సుబ్రమణ్యంరెడ్డి, గౌరీశంకర్‌రాజు, చంద్రమోహన్, సీఐ రాజశేఖర్ పాల్గొన్నారు.

అన్ని కులాల అభ్యున్నతికి కృషి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న బీస్ జిల్లా అధ్యక్షుడు నీలం నరేంద్ర

తిరుపతి రూరల్: అన్ని కులాల వారి అభ్యున్నతికి బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవా సమితి(బీస్) కృషి చేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నీలం.నరేంద్ర తెలిపారు. ఓటేరులో శనివారం బీస్ ఉమ్మడి చిత్తూరు జిల్లా, నెల్లూరు జిల్లాల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీస్ సేవలను విస్తృతం చేయాలని తీర్మానించారు. బీస్ క్యాలెండర్-2023ని ఆవిష్కరించారు. నీలం నరేంద్ర మాట్లాడుతూ బలిజ ఉద్యోగుల సంక్షేమంతో పాటు మిగిలిన కులాల్లోని పేదలను ఆదుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల అశోక్‌కుమార్, ప్రభురెడ్డి, ప్రసాద్, వెంకటాద్రి, మధుసూదన్, జయప్రకాష్ పాల్గొన్నారు.

వాలిపోయే పొద్దా నీకు వర్ణాలెందుకే?



దట్టమైన కారుమబ్బులు.. వాటి మధ్యలో మంచుదుప్పటి కప్పుకున్న శేషాచల కొండలు.. బంగరు ఛాయలో మెరుస్తున్న సూరీడి కిరణాలు.. అక్కడక్కడా పచ్చటి అందాలు.. వాటి అంచునే అటూఇటూ తిరిగే తూనీగలు.. అబ్బో..! ఒకటా.. రెండా.. ఆ ప్రకృతి సోయగాన్ని వర్ణించడం మహాకష్టం. అవతార్ సినిమాను తలపించేలా ఉంది కదూ ఈ చిత్రం. ఈ సుందర దృశ్యం శనివారం తిరుమల రెండో ఘాట్ రోడ్డులో కనిపించింది.

– కె.మోహన్‌కృష్ణ, సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

శరవేగంగా తిరుపతి రైల్వేస్టేషన్ రీమోడల్ పనులు



తిరుపతి అర్బన్: తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు శరవేగంతో సాగుతున్నాయి. రూ.320 కోట్ల తో రీ మోడల్ పనులు చేపట్టిన విషయం తెలిసిందే. రానున్న 40 ఏళ్ల పాటు ప్రయాణికులకు అనుకూలంగా ఉండేలా పనులు చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా స్టేషన్‌కు దక్షిణం వైపున కొత్త స్టేషన్ భవనం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే పునాదులు పనులు పూర్తయ్యాయి. అండర్ గ్రౌండ్ పనులు చేపట్టారు.

టాటా సుమో చోరీ

తిరుపతి రూరల్ : గాంధీపురం పంచాయతీ ధనలక్ష్మీనగర్‌లో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు టాటా సుమోను చోరీ చేశారు. బాధితుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎమ్మార్‌పల్లి ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. ఇంటి వద్ద పార్కింగ్ చేసిన సుమోను చోరీ చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా కక్షికర్తలైన తిరుపతి జిల్లా, చిన్నగొట్టిగల్లు మండలం టి.చట్టివారిపాలెం మజరా నల్లపరెడ్డిగారిపల్లిలో నివాసముండు లేట్ వెంకటరెడ్డి కుమారులైన 1) తిరుమల్యం భాస్కర్ రెడ్డి & 2) తిరుమల్యం బసివిరెడ్డిల తరఫున యావన్మందికి తెలియజేయడం ఏమనగా! క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తి నా కక్షికర్తలకు మరియు మేకల నారాయణస్వామి, పెద్దన్నగారి నాగభూషణం, తిరుమల్యం దిలీప్, మావులూరి శ్రీనాథ్, మావులూరి మనోహర, మావులూరి వసలక్ష్మమ్మ, వేమూరి నవనీతమ్మ అను వార్లకు ఉమ్మడి హక్కు అనుభవం కలిగి వున్నారు. నా కక్షికర్తలు వారికి రాబడిన హక్కును భాగపరిష్కారం చేసి ఇవ్వమని అడుగగా, అందులకు పై కనిన వారు నిరాకరించినారు. అదులకు నా కక్షికర్తలు వారికి రాబడిన హక్కును భాగపరిష్కారం కొరకు పీలేరు ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు దావా నెం.198/2022ను దాఖలు చేసినారు. దావా దాఖలు కాలంలో షెడ్యూలు ఆస్తిని ఇతరుల పేర ఏ విధమైన అన్యాక్రాంతములు వగైరాలు చేయకుండా తాత్కాలిక ఇంజంక్షన్ సహా ఐ.ఎ.నెం. 698/2022లో కోరి యున్నారు. ఇంకనూ జి.లోకనాథరెడ్డి మరియు ఇంకొకరిని పై కనిన దావాలో పార్టీలుగా చేర్చమని మరో ఐ.ఎ. నెం.1033/2022లో కోరియున్నారు.మరియు షెడ్యూలు దాఖలా ఆస్తికి సంబంధించిన గౌరవ హైకోర్టు, ఆంధ్రప్రదేశ్ నందు కూడా డబ్ల్యూపి. నెం.29138/2022 పెండింగులో వున్నది. ఇలా వుండగా పై కనిన జి.లోకనాథరెడ్డి, మేకల నారాయణస్వామి, పెద్దన్నగారి నాగభూషణం, తిరుమల్యం దిలీప్, మావులూరి శ్రీనాథ్, మావులూరి మనోహర్, మావులూరి వసలక్ష్మమ్మ, వేమూరి నవనీతమ్మలు దావా భూమిని నామమాత్రపు పత్రములు సృష్టించుటకు ప్రయత్నించుచున్నారని, అలా ఏవైనా పత్రములు సృష్టించినచో అలా ఎవ్వరైనను ఎలాంటి క్రయవిక్రయాలు జరిపినా సెక్షన్ 52 ఆఫ్ టిపి యాక్ట్ ప్రకారం అవి ఎంతమాత్రమూ చెల్లనేరవనీ, అట్లు కొన్నవారికి ఎలాంటి హక్కులు సంక్రమించవని తెలియజేయడమైనది. అలా ఎవరైనా విక్రయించుకొన్న యెడల నా కక్షికర్త, అమ్మినవారిపైన మరియు కొన్నవారిపైన చట్టపరమైన చర్యలు తీసుకొనబడునని మరియు దానికి వారే బాధ్యులగుదురని తెలియజేయడమైనది.

షెడ్యూలు:- తిరుపతి రి.డి.-చిన్నగొట్టిగల్లు సబ్ రి.డి. - చిన్నగొట్టిగల్లు మండలం, టి.చట్టివారిపాలెం రెవిన్యూ గ్రామంలో సర్వేనెం.1454 విస్తీర్ణం ఎ.10.44 సెంట్లు పైకి ఎ.0.25 సెంట్లు

వై.సింగారెడ్డి, BA, LLB, అడ్వకేట్, పీలేరు,
సెల్: 9885 228479, 99634 53348